రేషన్ కార్డు సర్వేపై అసహనం

- సర్వే చేయకుండానే పేర్లు నమోదు చేసిన అధికారులు
- పెళ్లి కాని వారి పేర్లు వచ్చాయంటూ ఆరోపిస్తున్న ప్రజలు



ఉండవెల్లిలో రేషన్ కార్డులు రాలేదని తహసీల్దార్‌కు వినతిపత్రానిస్తున్న యువకులు (ఫైల్)

ఉండవెల్లి : నూతన రేషన్ కార్డులు జారీకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి తేదీలు ప్రకటించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. మండలంలో రేషన్ కోసం పదేళ్లుగా వేచి చూస్తున్న వారు ఇప్పుడైనా రేషన్ కార్డు వస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. కొన్ని ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డు ముఖ్యం కావడంతో రేషన్ కార్డు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు పదేళ్లుగా రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు తమ పేర్లు జాబితాలో లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక ఏడాది కాలంలో వివాహమైన వారి పేర్లు, మండలంలోని కుటుంబ సర్వేలో నమోదు చేసిన వారి పేర్లు, సర్వే అధికారులకు అనుగుణంగా ఉన్న వారి పేర్లను మాత్రమే నమోదు చేశారని, వివాహం కాని వారి పేర్లు కూడా జాబితాలో వచ్చాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సర్వే చేయకుండానే..

ప్రతి గ్రామంలో పకడ్బందీగా సర్వే చేయాలంటూ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ మండలంలో అధికారులు సర్వేలో పాల్గొనలేదని, పలుకుబడి ఉన్న వారికి మాత్రమే పేర్లు న మోదు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సర్వే చే యాల్సిన అధికారులు కార్యాలయంలోనే ఉండి జాబితాలో పేర్లు నమోదు చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

కొత్త లిస్ట్ వచ్చింది కానీ..

కుటుంబ సర్వేలో పాల్గొన్న వారి పేర్లను రేషన్ కార్డులో నమోదు చేశారని ఏడాది కాలంలో వివాహమైన వారి పేర్లు మాత్రమే జాబితాలో రావడంతో పాటు ఏళ్లతరబడి ఎదురు చూస్తున్న వారి పేర్లు నమోదు కాకపోవడం.. రాకపోవడం ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులకు సర్వే చేయ్యాలని కోరుతుండగా కొన్ని చోట్ల లంచం ఇస్తే పేరు గ్యారెంటీ అని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో వివాహం కాని వారి పేర్లు రావడంతో అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ లేదు.. పథకాలు రావు



నాకు వివాహమై 9 ఏళ్లైనా రేషన్ కార్డు రాలేదు. అన్ని పథకాలు రేషన్ కార్డు ఉంటేనే వస్తాయని అధికారులు తెలిపినా, సర్వేలు చేసినా ఫలితం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్త లిస్టులో పేరు లేదు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని అర్హులకు రేషన్ కార్డులు జారీ చేయాలి.

- మేరి, ఉండవెల్లి

8 ఏళ్లైనా రేషన్ కార్డు రాలేదు..



రేషన్ కార్డు కోసం తిరిగి తిరిగి కాళ్లు అరిగిపోయాయి. కూలీ పనులు చేసుకుంటేనే జీవనం గడపాలి. మాకు వివాహమై 8 ఏళ్లు అయింది. ఇప్పటికి కార్డు రాలేదు. పైరవీలే పని చేస్తున్నాయి. రేషన్ కార్డులు లేక కొనుకున్న బియ్యంతోనే కడుపు నింపుకుంటున్నాం.

- ధనలక్ష్మి, చిన్న ఆముదాలపాడు

అత్తామామల రేషన్ కార్డే..



మా గ్రామంలో ఏడాది కాలంలో వివాహమైన వారికి రేషన్ కార్డు జాబితాలో పేర్లు వచ్చాయి. 8 ఏళ్లైనా వివాహమై మాకు రేషన్ కార్డులు రాలేదు. అత్తామామల రేషన్ కార్డు మీదనే రేషన్ తెచ్చుకుంటున్నాం. ప్రభుత్వ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నాం.

- అడ్డాకుల సత్య, చిన్న ఆముదాలపాడు

క్లుప్తంగా

జాబితాలో పేర్లు లేవంటూ గ్రామస్తుల ధర్నా



మానవపాడు: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట శనివారం జల్లాపురం గ్రామస్తులు పలువురు రేషన్‌కార్డు జాబితాలో పేర్లు లేవంటూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రేషన్ కార్డుకు అర్హత ఉన్నా కార్డు మాత్రం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జోసెఫ్, చిన్న నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

అయిజ: మండల కేంద్రంలో ఎన్టీఆర్ అభిమానులు శనివారం దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్టానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. అదే విధంగా జూనియర్ ఎన్టీఆర్ పేరుతో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుధాకర్ గౌడ్, శ్రీధర్, భీమన్న, నాగన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో..

శాంతినగర్ : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి కార్యక్రమం శాంతినగర్‌లో శనివారం నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఎగురవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్ణచంద్రరావు, చాణక్య, రామన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



ఇటిక్యాల : మండల పరిధిలోని బుద్దారెడ్డిపల్లి గ్రామంలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డెప్ప భూమి పూజ చేశారు. రూ.5లక్షల వ్యయంతో నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రుక్మందర్ రెడ్డి, నాయకులు తిరుమలేష్, అల్లబకాష్, చాంద్‌బాష, స్వాములు, వెంకటస్వామి, ప్రభుదాస్, రాజారెడ్డి, రామేశ్వర్ రెడ్డి, రామకృష్ణ, శేఖర్, ఎర్రన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు



ఉండవెల్లి : మండలంలోని జాతీయ రహదారిపై కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న స్కార్పియో కారు పుల్లూరు టోల్ ప్లాజా సమీపంలో ముందు వాహనం అడ్డుగా రావడంతో అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకుపోయింది. కారులో ఇద్దరు వ్యక్తులు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

కాలుష్యంతో ఇబ్బందులు

గద్వాల: పట్టణంలోని ప్రభుత్వ ఇండోర్ స్టేడియం వద్ద ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలు నుంచి వెలువడుతున్న కాలుష్య కారకాలతో స్టేడియం పాడవడమే కాకుండా వాకర్స్ కూడా ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజా సంఘాల నాయకుడు ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంపై కలెక్టర్, మున్సిపల్ అధికారులు, సిబ్బందికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నత అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలి ఆయన కోరారు.

శివస్వాముల ప్రత్యేక పూజలు



ధరూరు : మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శివస్వాముల ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఆలయంలో 42 మంది శివస్వాములు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నట్లు ఆలయ అర్చకులు కిష్టాచార్యులు తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో బిక్ష ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలే లక్ష్యం


విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

గద్వాల: ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేసే చరిత్ర సీపీఎం పార్టీదని, ప్రజా పోరాటాలకు అండగా నిలబడాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేరు నర్సింహ అన్నారు. త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభల సందర్భంగా శనివారం గద్వాల పట్టణంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రమజీవుల కోసం పోరాటాలు చేస్తున్న సీపీఎం పార్టీకి ఆర్థిక సహకారం అందించి ప్రజా ఉద్యమాలకు అండగా నిలబడాలని ప్రజలను కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేసి సమాజ మార్పులో కీలకపాత్ర పోషిస్తున్న సీపీఎం మహాసభలకు విరివిగా విరాళాలు అందించి మహాసభలు జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ, ఆంజనేయులు, నర్సింహా, రాము, చంద్రం, కృష్ణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి


చైర్మన్‌కు సమస్యలు తెలియజేస్తున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి

అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో తిష్టవేసిన సమస్యలు పరిష్కరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్నను కోరారు. శనివారం మున్సిపాలిటీలో 7వ వార్డు టీచర్స్ కాలనీ, దేవనగర్, 8వ వార్డు భరత్ నగర్, గాజులపేటలను మున్సిపల్ చైర్మన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు మున్సిపల్ చైర్మన్‌కు 8వ వార్డులో నెలకొన్న సమస్యలు తెలిపారు. ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం వద్ద ప్రధాన రోడ్డు కూడలిలో ఐమాస్ట్ లైట్ స్తంభం విరిగిపడిపోయి ఏళ్లు గడుస్తున్నా కొత్తది ఏర్పాటు చేయలేదన్నారు. స్వచ్ఛ భారత్ నిధులు వస్తున్నా సరే చెత్తను సేకరించే వాహనాలు రావడం లేదని, కాలనీలో ముళ్ల పొదలు దట్టంగా పెరిగాయన్నారు. కాలనీల్లో పూర్తిగా పారిశుధ్యం లోపించిందని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగన్న, వాటర్ లైన్‌మెన్ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోనే ఉత్తమ భవిష్యత్


కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు, కార్యకర్తలు

అయిజ : కాంగ్రెస్ పార్టీలోనే నాయకులకు, కార్యకర్తలకు ఉత్తమ భవిష్యత్ ఉంటుందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో 2, 13, 20 వార్డుల కౌన్సిలర్లు జులేఖాబేగం, వెంకటేష్, హుసేన్‌బీ, కోఆప్షన్ సభ్యుడు జాకీర్ హుసేన్‌లతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సంపత్ కుమార్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా నాయకులు, కార్యర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప, కాంగ్రెస్ నాయకులు శేక్షావలి ఆచారి, జయరాముడు, లక్ష్మికాంత రావు, నాగిరెడ్డి, రాణెమ్మ, ఆర్. శ్రీధర్, మద్దిలేటి, బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలి


నూతన దప్పు కమిటీ సభ్యులతో జగ్జీవన్

అలంపూర్ రూరల్ : ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్‌లో జరిగే వెయ్యి గొంతులు.. లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేసి నగరం నడిబొడ్డున డప్పుల మోత మోగిద్దామని డప్పు కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జగ్జీవన్ మాదిగ అన్నారు. మండల పరిధిలోని గొందిమల్ల గ్రామంలో శనివారం డప్పు కళాకారుల కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులుగా పెద్ద మద్దిలేటి, స్వాములు, విజయ్, ఉపాధ్యాక్షుడిగా మద్దిలేటి, సహాయ కార్యదర్శిగా మొగిలి రాజు, కోశాధికారిగా క్రాంతి, కమిటీ సభ్యులుగా నర్సింహ, చిన్నమద్దిలేటి, గోవింద్, మధును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయేతర భూముల పరిశీలన

ఎర్రవల్లి : మండల పరిధిలోని వివిధ గ్రామాలను శనివారం రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సందర్శించి వ్యవసాయేతర భూములు పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్, తహసీల్దార్ నరేష్ మండలంలోని బీచుపల్లి, తిమ్మాపురం గ్రామాలను సందర్శించారు. పట్టా పాసుపుస్తకం గల కల్లందొడ్లు, చెరువులు, నాలా కన్వర్షన్, అనధికార లేఅవుట్ భూములు పరిశీలించి నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఓ రవికుమార్, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఏఈఓలు పాల్గొన్నారు.

ఇటిక్యాలలో..

ఇటిక్యాల : మండల కేంద్రంలోని వ్యవసాయేతర భూములను శనివారం రెవెన్యూ, వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నరేందర్ వ్యవసాయ అధికారులతో కలసి మండల కేంద్రంలోని అనధికార లేఅవుట్‌లను పరిశీలించి నమోదు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ భీంసేన్‌రావు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


బీచుపల్లిలో వ్యవసాయేతర భూములను పరిశీలిస్తున్న అధికారులు

అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం

మానవపాడు : మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యలయంలో శనివారం సీడీపీఓ సుజాత ఆధ్వర్యంలో రాజోళి, ఎర్రవల్లి మండలాల అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎత్తు, బరువు, పౌష్టికాహరం పిల్లలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

57 మంది గైర్హాజరు

అలంపూర్ : నవోదయ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో నవోదయ ప్రవేశ పరీక్షలు శనివారం జరిగాయి. మొత్తం 263 మంది విద్యార్థులకు గాను 206 మంది విద్యార్థులు హాజరు కాగా 57 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షలను పరిశీలకుడు హృదయ రాజు, సిబ్బంది పరిశీలించినట్లు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ.. తప్పించుకునే క్రమంలో గాయాలు



గద్వాల క్రైం: పట్టణ పోలీసులు గద్వాల- మేళ్లచెరువు రోడ్డు మార్గంలో శనివారం రాత్రి 9 గంటల సమయంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన రామకృష్ణ బైక్‌పై తప్పించుకునే యత్నించగా కానిస్టేబుల్ పట్టుకునే ప్రయత్నంలో లాఠీతో తలపై దాడి చేసినట్లు బాధితుడు తన సెల్‌ఫోన్ ద్వారా పలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో అది కాస్తా వైరలైంది. వివరాలు.. పట్టణానికి చెందిన రామకృష్ణ బైక్‌పై వస్తుండగా పోలీసుల తనిఖీలు గుర్తించి బైక్‌ను వెనుకకు తిప్పుకుని వెళ్లేందుకు ప్రయత్నం చేశాడు. గమనించిన కానిస్టేబుల్ రవి నాయక్ వాహనదారుడిని పట్టుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు లాఠీతో తలపై, కుడి చేయిపై దాడి చేయడంతో తలకు, మోచేతికి గాయాలయ్యాయి. దీంతో రామకృష్ణ జరిగిన సంఘటనను వీడియో తీస్తు కానిస్టేబుల్‌ను ప్రశ్నించాడు. పోలీసులు క్షతగాతుడిని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు. ఈ విషయమై పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ మాట్లాడుతూ.. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో వాహనదారుడు తప్పించుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనగా పేర్కొన్నారు. కానిస్టేబుల్ రవినాయక్ దాడి చేసినట్లు వస్తున్న ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే చట్టపరమైన చర్యలు ఉంటాయనే ఆందోళనతో బైక్‌పై కిందపడి ఉండవచ్చన్న అనుమానం వ్యక్తం చేశారు.

కార్మికులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ : చేనేత కార్మికులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్యేను చేనేత జౌళి శాఖ ఏడీ గోవిందయ్య, ఫీల్డ్ ఆఫీసర్ రాజేశ్వర్ రెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. చేనేత సమస్యలు, వాటి పరిష్కారాలకుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చేనేత కార్మికుల స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వార చేనేత కార్మికులకు అందుతున్న సంక్షేమ పథకాలు, వాటి అమలుపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చేనేత కార్మికులకు పూర్తి స్థాయిలో అందించడానికి కృషి చేయాలన్నారు. ఈ ప్రాంత ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేస్తున్న చేనేత కార్మికుల అభివృద్ధికి అధికారులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..

కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అయిజ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన హరిజన ప్రసాద్‌కు రూ. 11500, అయిజ మున్సిపాలిటికి చెందిన సునీతకు రూ. 36వేలు, మానవపాడు మండలం కలుకుంట్ల గ్రామానికి చెందిన నూర్ బాషకు రూ. 15,500 సీఎం సహాయ నిధి నుంచి మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు గజేందర్ రెడ్డి, మత్స్యశాఖ సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కిషోర్, ఆత్మలింగారెడ్డి, రమేష్, తిరుపాల్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు


భైరంపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పద్మావతి

అలంపూర్ రూరల్ : రేషన్ కార్డు సర్వేలో సిబ్బంది ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని ఎంపీడీఓ పద్మావతి అన్నారు. మండల పరిధిలోని గొందిమల్ల, భైరంపల్లి గ్రామాల్లో ఎంపీడీఓ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

21 నుంచి గ్రామ సభలు

అయిజ : ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు ఏర్పాటు చేసి రేషన్ కార్డు లబ్ధిదారుల తుది జాబితా కలెక్టర్‌కు అందజేస్తామని ఎంపీడీఓ వెంకటయ్య అన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్లు ఆయా గ్రామాల్లో, వార్డుల్లో పర్యటించారు. జాబితాలోని పేర్లు ఉన్నవారి ఇంటి వద్దకు వెళ్లి నిర్ధారణ చేసుకునే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం


తూర్పుతండాలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



చెన్నిపాడులో బాల కార్మికులతో మాట్లాడుతున్న అధికారులు, ఉపాధ్యాయులు

గద్వాల : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ఆపరేషన్-11 కార్యక్రమం చేపడుతున్నట్లు సంక్షేమశాఖ జిల్లా అధికారి సునంద ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో రెండు టీంలు ఏర్పాటు చేసి డ్రాప్ అవుట్ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈనెల 15, 16, 17 తేదీల్లో గట్టు మండలంలో 10మంది, కేటీదొడ్డి మండలంలో 14, ధరూరులో 22, మల్దకల్‌లో 20, అయిజలో 8, వడ్డేపల్లిలో 9 మంది మొత్తం 83 డ్రాప్‌అవుట్ పిల్లలను గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి తిరిగి పాఠశాలలో చేర్పించినట్లు తెలియజేశారు.

మైనర్లతో పని చేయించడం నేరం..

మానవపాడు: 18 ఏళ్లలోపు పిల్లలను పనుల్లో ఉంచినా, బలవంతంగా బిక్షటాన, వెట్టిచాకారి చేయించడం చట్టరీత్యా నేరమని అసిస్టెంట్ లేబర్ అధికారి వేణుగోపాల్, ఎస్ఐ కేశవరావు అన్నారు. శనివారం మండలంలోని చెన్నిపాడు, చిన్నపోతులపాడు గ్రామాల్లో డ్రాపౌట్ అయిన పిల్లలకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. 1098, 100కి ఫోన్ చేసి బాలకార్మికులు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీసీపీయూ లీగల్ అధికారి ఎత్తం శివ, 1098 సిబ్బంది లక్ష్మి, కానిస్టేబుల్ మనోహరి, వీరన్న, స్వచ్ఛంద సంస్థ వీజులత తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి..

కేటీదొడ్డి: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని తూర్పుతండా గ్రామంలో బడిఈడు పిల్లలపై ఇంటింటి తిరుగుతూ సర్వే చేసి 10 మంది బడి బయట పిల్లలను గుర్తించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ శివరాజ్, యుగంధర్, హెచ్‌ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆపరేషన్ స్మైల్‌లో పాల్గొన్న అధికారులు..

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పనులకు వెళ్తుండగా వారిని గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ టీం ఆధ్వర్యంలో ఆపరేషన్ స్మైల్ ఎక్స్‌ఐలో భాగంగా అవగాహన కల్పించినట్లు ఎంఈఓ రామకృష్ణ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో బడి బయట తిరుగుతున్న విద్యార్థులను గుర్తించి పాఠశాలలో అవగాహన కల్పించారు. ఆపరేషన్ స్మైల్ టీం ఎస్ఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి తప్పక చదువుకోవాలన్నారు. విద్యార్థులను పనులకు వినియోగించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రకాష్, నవీన్, లేబర్ డిపార్ట్‌మెంట్ జూనియర్ అసిస్టెంట్ మెయిన్ బాషా, కానిస్టేబుల్ రాజు, మంజుల, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిని అందుబాటులోకి తేవాలి


మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

అలంపూర్ : కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రిని అందుబాటులోకి తేవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆకేపోగు రాంబాబు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని 100 పడకల ఆస్పత్రిని రాంబాబు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించి 13 నెలలు గడిచిన వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయలేదన్నారు. మూడు రాష్ట్రాల కూడలిగా ఉన్న అలంపూర్ చౌరస్తాలో ఆస్పత్రి నిర్మిస్తే నిరుపయోగంగా ఉంచారని మండిపడ్డారు. ఆస్పత్రి లేకపోవడంతో అత్యవసర పరిస్థితిల్లో ఈ ప్రాంత ప్రజలు వైద్యం కోసం ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. రూ. 21 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆస్పత్రిని వైద్య సేవలు లేకుండా ఉంచడం దురదృష్టకరమన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పాలకులకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే వంద పడకల ఆస్పత్రిలో వైద్య సేవలు అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు శివర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలి


భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కేశవ్

గద్వాలటౌన్ : గద్వాల పట్టణాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. 5వ వార్డు వెంకటంపల్లిలో శనివారం రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు చైర్మన్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి నిరంతర ప్రక్రియని, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా గద్వాల పట్టణాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి, ఆదిశగా కౌన్సిల్ కృషి చేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పరిసరాల స్వచ్ఛత కోసం పెద్దఎత్తున వాహనాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శారదా, నాయకులు సురేష్, ఆనంద్, నాగరాజు, తిమ్మోజీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సంపు మోటార్ అపహరణ

ఎర్రవల్లి : మండల పరిధిలోని దువాసిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని సంపు మోటార్ అపహరణకు గురైంది. పాఠశాల అవసరాల కోసం గతంలో సంపు ఏర్పాటు చేసి అక్కడి నుంచి పాఠశాల భవనంపై ఉన్న ట్యాంకులోకి నీటిని పంపింగ్ చేసేందుకు మోటార్‌ను ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ తెలిపారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పాఠశాల దగ్గరకు వచ్చి విద్యుత్ వైర్ కత్తిరించి మోటార్‌ను అపహరించుకు పోయినట్లు తెలిపారు. ఉదయం ఉపాధ్యాయులు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.